సాక్షి గుంటూరు
మంగళవారం । 12 । డిసెంబర్ । 2023



మల్లేశ్వరుని సన్నిధిలో హైకోర్టు జడ్జి

పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ దుప్పల వెంకటరమణ సోమవారం దర్శించుకున్నారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.



అమరేశ్వరుని సేవలో మంత్రి

అమరావతి: శ్రీబాల చాముండికా సమేత అమరేశ్వర స్వామిని మంత్రి ఉషాశ్రీచరణ్ దర్శించుకున్నారు. కార్తిక దీపారాధన చేశారు.

అమరేశ్వరుని సేవలో జస్టిస్ రవీంద్రబాబు



అమరావతి: శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వరుని సోమవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి ఎ.వి.రవీంద్రబాబు దంపతులు దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

సమాచార హక్కు చట్టంతో సత్ఫలితాలు

ఆర్టీఐ కమిషనర్ శామ్యూల్ జోనాథన్



చీరాల టౌన్: సమాచార హక్కు చట్టం ద్వారా ప్రతి ప్రభుత్వ శాఖ నుంచి పౌరులకు కావాల్సిన సమాచారాన్ని తెలుసుకోవచ్చని ఆర్టీఐ కమిషనర్ శామ్యూల్ జోనాథన్ అన్నారు. పట్టణంలోని డోలా ఐజాక్ ఎన్జీవో భవనంలో చీరాల షాడోస్ సంస్థ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి అడిగిన ప్రభుత్వ శాఖల నుంచి సమాచారాన్ని అందించడం ప్రభుత్వ అధికారుల బాధ్యతన్నారు. ప్రభుత్వం అందించే ప్రతి పథకం, జీవోలు, అభివృద్ధి పనులు, తదితర ప్రతి అంశం గురించి తెలుసుకోవచ్చన్నారు. వ్యక్తి మీద కక్షలతో వారికి సంబంధించిన వివరాలను అడగరాదన్నారు. ప్రజలు కూడా స.హ. చట్టాన్ని కేవలం సమాజాభివృద్ధికి వినియోగిస్తేనే సత్ఫలితాలు పొందవచ్చని, స్వలాభం కోసం, బెదిరింపులకు ఈ చట్టాన్ని వినియోగించరాదని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ జి.ప్రభాకరరావు, షాడోస్ నిర్వాహకులు రాజాసాల్మన్, చైల్డ్ లేబర్ ఆఫీసర్ రామకృష్ణ, మహిళా కళాశాల పీడీ నీలకుమారి పాల్గొన్నారు.

రేపు జూనియర్ అసిస్టెంట్‌లకు ప్రమోషన్ కౌన్సెలింగ్

గుంటూరు మెడికల్ : ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారికి ఈనెల 13న సీనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) డాక్టర్ బి.శోభారాణి తెలిపారు. ఉమ్మడి మూడు జిల్లాల్లో జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, జూనియర్ స్టెనోలు, స్టోర్ కీపర్లుగా పనిచేస్తున్న 28 మందికి ప్రమోషన్లు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశామన్నారు. గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఉన్న మెడికల్ అండ్ హెల్త్ రీజినల్ డైరెక్టర్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు కౌన్సెలింగ్ జరుగుతుందని వెల్లడించారు.

దివ్యాంగురాలికి ఇంటి స్థలం



నరసరావుపేట: దివ్యాంగురాలికి ఇంటి స్థలం పట్టాను కలెక్టర్ ఎల్.శివశంకర్ అందజేశారు. నాదెండ్ల మండలం, తూబాడు గ్రామానికి చెందిన వి.జ్యోతి ఇంటి స్థలం కేటాయించాలని గత నెల 'జగనన్నకు చెబుదాం'(స్పందన)లో దరఖాస్తు చేసుకుంది. ఆమెకు వెంటనే ఇంటి స్థలం మంజూరు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో బాధితురాలికి ఇంటి స్థలం మంజూరు పత్రాలు అందజేశారు.

రేపు భవిష్యనిధి పెన్షన్ అదాలత్

గుంటూరు ఎడ్యుకేషన్: ఈనెల 13న పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కార్యాలయ వర్గాలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపాయి. గుంటూరు కృష్ణనగర్‌లోని భవిష్యనిధి ప్రాంతీయ కార్యాలయంలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని పీఎఫ్ పెన్షనర్లు వారి ఫిర్యాదులు, దరఖాస్తులను నేరుగా భవిష్యనిధి కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సమర్పించవచ్చని తెలిపారు. వ్యక్తిగతంగా హాజరు కాలేని వారు ఆన్‌లైన్, వాట్సాప్, వెబ్ మార్గాల ద్వారా పంపవచ్చని సూచించారు. ro.guntur@epfindia.gov.inతో పాటు వాట్సప్ నంబరు 9494657469కు పంపాలని తెలిపారు. ల్యాండ్‌లైన్ నంబర్లు 0863-2344106, 2232921 నంబర్లో సంప్రదించాలని పేర్కొన్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.1800, గరిష్ట ధర రూ.3,000, మోడల్ ధర రూ.2,300 వరకు పలికింది.

నవ సారథులు

• గెలుపే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ అడుగులు • పలు నియోజకవర్గాల్లో ఇన్‌చార్జుల మార్పు



మేకతోటి సుచరిత
తాడికొండ



మల్లెల రాజేష్ నాయుడు
చిలకలూరిపేట



ఈవూరు గణేశ్
రేపల్లె



మేరుగ నాగార్జున
సంతనూతలపాడు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గెలుపే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 11 మంది నియోజకవర్గ ఇన్‌చార్జులను మార్పు చేసింది. ఇందులో గుంటూరు జిల్లాలో నలుగురు, బాపట్లలో ముగ్గురు, పల్నాడు జిల్లాలో ఒకరు ఉన్నారు. గుంటూరు పశ్చిమకు మంత్రి విడదల రజిని, మంగళగిరికి ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, ప్రత్తిపాడుకు బాలసాని కిరణ్‌కుమార్, వేమూరుకు వరికూటి అశోక్‌బాబు, ప్రకాశం జిల్లా సంతనూతలపాడుకు మంత్రి మేరుగ నాగార్జున, తాడికొండకు మాజీ మంత్రి మేకతోటి సుచరిత, చిలకలూరిపేటకు మల్లెల రాజేష్ నాయుడు, అద్దంకికి పాణెం హనిమిరెడ్డి, రేపల్లెకు ఈవూరు గణేష్‌లను ఇన్‌చార్జులుగా నియమించారు. ఈ మేరకు పార్టీ నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, బొత్స సత్యనారాయణ తాడేపల్లి పార్టీ కార్యాలయంలో సోమవారం ప్రకటన చేశారు. 2024 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఈ మార్పులు చేశారు. అన్ని స్థానాల్లో విజయమే లక్ష్యంగా ఇన్‌చార్జుల నియామకంపై పార్టీ కసరత్తు చేస్తోంది. కొత్తగా ప్రకటించిన ఇన్‌చార్జులు వెంటనే బాధ్యతలు చేపడతారు. ఇప్పటి వరకూ ఇన్‌చార్జులుగా ఉన్న వారి సేవలను పార్టీ వేరే విధంగా ఉపయోగించుకోనుంది.

గెలి'చేనేత' గంజి

■ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవికి బాధ్యతలు అప్పగించారు. గంజి చిరంజీవి 2014లో 12 ఓట్ల స్వల్ప తేడాతో తెలుగుదేశం తరఫున పోటీ చేసి ఓడిపోయారు. గత ఏడాది ఈయన వైఎస్సార్ సీపీలో చేరారు. చేనేత వర్గాల్లో ఈయనకు మంచి పట్టు ఉంది.

సుపరిచిత సుచరిత

■ తాడికొండ బాధ్యతలు మాజీ హోం మంత్రి మేకతోటి సుచరితకు అప్పగించారు. ప్రస్తుతం ఆమె ప్రత్తిపాడు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆమె సొంత మండలం ఫిరంగిపురం తాడికొండ పరిధిలోకే వస్తోంది.

ప్రకటించిన పార్టీ అధిష్టానం



పశ్చిమాన నవోదయం

■ చిలకలూరిపేటలో తెలుగుదేశం పార్టీ కంచుకోటను బద్దలు కొట్టిన మంత్రి విడదల రజినికి గుంటూరు పశ్చిమ బాధ్యతలు పార్టీ అప్పగించింది. ఈ సీటు మొదటి నుంచి తెలుగుదేశం పార్టీకి పట్టంకడుతోంది. గత ఎన్నికల్లో కూడా తెలుగుదేశం పార్టీ తరఫున మద్దాళి గిరి గెలుపొందారు. తర్వాత ఆయన వైఎస్సార్ సీపీలో చేరారు. ఈసారి ఈ సీటును వైఎస్సార్ సీపీ గెలుచుకోవడం కోసం విడదల రజినిని పశ్చిమానికి మార్చారు.



విడదల రజిని
గుంటూరు పశ్చిమ

కొత్త 'కిరణం'

■ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జిగా విజయవాడకు చెందిన బాలసాని కిరణ్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈయన విజయవాడ పూర్ణానందం పేటలో ఉంటూ న్యాయవాదిగా ఉన్నారు.

పేటకు 'మల్లెల' దండ

■ పల్నాడు జిల్లా చిలకలూరి పేటకు మల్లెల రాజేష్ నాయుడిని ఇన్‌చార్జిగా ప్రకటించారు. ఇక్కడ గెలిచిన మంత్రి రజినికి గుంటూరు పశ్చిమ అప్పగించడంతో రాజేష్‌నాయుడిని ఇక్కడ నియమించారు. ఈయన కుటుంబానికి రాజకీయ నేపథ్యం ఉంది. రాజేష్ నాయుడు తాత మల్లెల బుచ్చయ్య చిలకలూరిపేట మున్సిపల్ వైస్ చైర్మన్‌గా, కొమరవల్లిపాడు వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా పనిచేయగా, తండ్రి మల్లెల సత్యనారాయణ మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేశారు. రాజేష్‌నాయుడు ప్రస్తుతం ఏపీఎస్ఐడీసీ డైరెక్టర్‌గా ఉన్నారు.

అశోక్ ఆరంగేట్రం

■ బాపట్ల జిల్లా వేమూరుకు చెందిన మంత్రి మేరుగ నాగార్జునను బాపట్ల పార్లమెంట్ పరిధిలోని సంతనూతలపాడు ఇన్‌చార్జిగా నియమించారు. వేమూరుకు ప్రకాశం జిల్లా కొండెపి ఇన్‌చార్జిగా ఉన్న వరికూటి అశోక్‌బాబును నియమించారు. ఆయన గతంలో రవాణా శాఖలో పనిచేసి తర్వాత రాజకీయాల్లోకి వచ్చారు.

రైతు బిడ్డ పాణెం

■ బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గం ఇన్‌చార్జిగా పాణెం హనిమిరెడ్డిని నియమించారు. ఈయన పెదకూరపాడు నియోజకవర్గంలోని క్రోసూరు మండలం దొడ్లేరు గ్రామానికి చెందిన రైతు కుటుంబం నుంచి వచ్చారు. 2016-17 సంవత్సరంలో పెదకూరపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా, ఆ తర్వాత పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు.

రేపల్లె గోపాలుడు గణేశ్

■ రేపల్లె నియోజకవర్గానికి ఈవూరు గణేష్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. ఈయన తల్లి ఈవూరు సీతారావమ్మ గతంలో కూచినపూడి నియోజకవర్గం నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు.



బాలసాని కిరణ్‌కుమార్
ప్రత్తిపాడు



గంజి చిరంజీవి
మంగళగిరి



వరికూటి అశోక్‌బాబు
వేమూరు



పాణెం హనిమిరెడ్డి
అద్దంకి

కో'లా'హలం



యువ న్యాయవాదులతో కలిసి వైఎస్సార్ లా నేస్తం జమ కార్యక్రమంలో పాల్గొన్న జేసీ రాజకుమారి, రాజ్యసభ సభ్యులు అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాళి గిరి, ఎమ్మెల్సీ హనుమంతరావు, గంజి చిరంజీవి తదితరులు

- వైఎస్సార్ లా నేస్తం ద్వారా యువ న్యాయవాదులకు భరోసా
- 243 మందికి ప్రయోజనం
- రూ.69.75 లక్షల మేర లబ్ధి
- హర్షం వ్యక్తం చేసిన లబ్ధిదారులు

గుంటూరు వెస్ట్: కొత్తగా న్యాయవాద వృత్తిని చేపట్టే యువతకు కొంత కాలం ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల నుంచి వైఎస్సార్ లా నేస్తం పథకం ద్వారా సహాయం అందజేస్తోందని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ లా నేస్తం ద్వారా వరుసగా మూడో సవత్సరం రెండో విడత నగదు మొత్తాలను బటన్ నొక్కి అర్హత కల్గిన యువ న్యాయవాదుల ఖాతాల్లోకి జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు వర్చువల్ విధానంలో వీక్షించారు. జేసీ మాట్లాడుతూ ప్రతి నెలా రూ.5,000 మూడేళ్ల పాటు ప్రభుత్వం అందజేస్తోందన్నారు. జిల్లాలో 243 మందికి రూ.69.75 లక్షలు నేరుగా వారి ఖాతాల్లోకి జమైనట్టు వెల్లడించారు. మూడేళ్ల నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 569 మందికి రూ.10.24 కోట్లు అందాయని తెలిపారు. కరోనా క్లిష్ట సమయంలోనూ సంక్షేమ పథకాలు ఆపకుండా ప్రభుత్వం అందజేస్తోందన్నారు. న్యాయవాదులు పొందుతున్న ఈ ఆర్థిక భరోసాతో తమ వృత్తిలో స్థిరపడాలని కోరారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, శాసన సభ్యులు మద్దాళి గిరిధర్, మొహమ్మద్ ముస్తఫా, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరి, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, వృద్ధులు, వికలాంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నూరి ఫాతిమా, బొందిలి సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ ఆర్.ఝాన్సీలక్ష్మీభాయ్, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు పాల్గొన్నారు.

జగన్ సార్‌కు ధన్యవాదాలు



న్యాయవాద డిగ్రీని చదివేటప్పుడు ఇంట్లో తల్లిదండ్రులు సహకరిస్తారు. చదువు అయిన తర్వాత డబ్బులు అడగలేం. ఈ వృత్తిలో స్థిరపడాలంటే కనీసం 3 నుంచి 5 ఏళ్లు పడుతుంది. ఈ సమయంలో లా నేస్తం ఎంతో భరోసా ఇస్తోంది. నెలకు రూ.5,000 బాగా ఉపయోగపడతాయి. పోటీ పరీక్షల సిద్ధమయ్యేందుకు ఆర్థిక ఇబ్బందులు ఉండవు. జగన్ సార్‌కు ధన్యవాదాలు.

– సి.హెచ్.వెన్నెల, గుంటూరు

పుస్తకాలకు వాడుకుంటాను



న్యాయవాద వృత్తిలో రాణించాలంటే చాలా పుస్తకాలు కొనాల్సి ఉంటుంది. ఇవి ఖరీదైనవి. ప్రభుత్వం ఇస్తున్న డబ్బు వీటికి ఉపయోగిస్తాను. ముఖ్యంగా ఇంట్లో ఖర్చులకు అడగకుండా ఉంటున్నాను. ఇప్పటి వరకు క్రమం తప్పకుండా డబ్బులు వచ్చాయి. వచ్చే ఏడాది కూడా జగన్ సార్ ముఖ్యమంత్రి అయ్యి నాలాంటి యువ న్యాయవాదులకు ఈ పథకాన్ని కొనసాగించాలని కోరుకుంటున్నాను.

– వై.రిషికేష్, గుంటూరు

సివిల్ తగాదాలు కోర్టుల్లో తేల్చుకోండి

జాయింట్ కలెక్టర్ రాజకుమారి

గుంటూరు వెస్ట్: కోర్టుల్లో తేల్చుకోవాల్సిన సివిల్ తగాదాలను తమవద్దకు తెస్తున్నారని, వీటిని అక్కడే పరిష్కరించుకోవాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి స్పష్టం చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ కోర్టు అంశాల్లో తాము జోక్యం చేసుకోబోమన్నారు. కోర్టు ఆదేశాలిస్తే వాటిని అమలు చేస్తామని తెలిపారు. కొందరు వ్యక్తిగత కక్షలతో తప్పుడు ఫిర్యాదులు ఇస్తున్నారని, ఇటువంటివి తాము ప్రోత్సహించబోమని తేల్చిచెప్పారు. జిల్లా యంత్రాంగం మొత్తం ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఒకే వేదికపైకి వస్తోందని, తప్పుడు ఫిర్యాదుల కారణంగా సిబ్బంది విలువైన సమయం వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు పొందిన వారు సీనియర్ల వద్ద పని నేర్చుకోవాలన్నారు. ప్రజలకు సేవ చేయడంలో నిమగ్నమవ్వాలని తెలిపారు. అనంతరం వచ్చిన 190 అర్జీలను జేసీతోపాటు డీఆర్వో చంద్రశేఖరరావు, ఆర్డీఓ పి.శ్రీకర్, ప్రభాకరరెడ్డి, జిల్లా అధికారులు పరిశీలించారు.

ఆబాలగోపాలం మురిసే

- బాలోత్సవ్-2023 ప్రారంభం
- ప్రపంచ తెలుగు బాలల పండుగకు వీవీఐటీ వేదిక
- మూడురోజులపాటు అలరించనున్న బాలలు
- 20 అంశాలు, 61 విభాగాలు, 30 వేదికలు
- తొలిరోజు అదరగొట్టిన 4,500 మంది చిన్నారులు



చిన్నారులతో కలసి బెలూన్‌లు ఎగురవేస్తున్న వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తదితరులు

పెదకాకాని: చిన్నారుల చేతుల్లో లాలనగా ఒదిగిన కుంచెలు అందమైన చిత్ర రాజసాలకు చిత్రికపట్టాయి. అదిరేటి స్టెప్పునేసేస్తే అంటూ దుమ్మురేపిన పాశ్చాత్య నృత్యాలు చూపరులను ఉర్రూతలూగించాయి. సంప్రదాయం ఉట్టిపడే హావభావాలతో కళాత్మకంగా కదిలిన బాలల శాస్త్రీయ నృత్యరీతులు సంస్కృతికి అద్దం కట్టాయి. ప్రతిభకు పదును పెట్టి ఆటపాటల్లో అదరగొట్టిన బాలల ఉత్సాహాన్ని కరతాళధ్వనులు వన్స్‌మోర్ అంటూ వెన్నుతట్టాయి. బాలోత్సవ్ వేళ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వందల మంది విద్యార్థుల సృజనాత్మకత, ప్రతిభా పాటవాలను చూసిన గురువులు, తల్లిదండ్రుల హృదయాలు ఆనందంతో మురిసిపోయాయి. వీవీఐటీ వేదికగా సోమవారం ప్రారంభమైన బాలోత్సవం ఆహూతులను అబ్బురపరిచింది. విద్యార్థుల్లోని నైపుణ్యాలను, సృజనాత్మకతను, ఆలోచనలను పెంచేందుకు బాలోత్సవ్ పోటీలు దోహదపడతాయని కొత్తగూడెం బాలోత్సవ్ వ్యవస్థాపకుడు వాసిరెడ్డి రమేష్‌బాబు చెప్పారు. గుంటూరు జిల్లా, పెదకాకాని మండలంలని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సోమవారం ప్రపంచ తెలుగు బాలల పండుగ-బాలోత్సవ్ 2023 అట్టహాసంగా ప్రారంభమైంది. ప్రారంభోత్సవానికి కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా వాసిరెడ్డి రమేష్‌బాబు మాట్లాడుతూ బాలోత్సవ్ పోటీలలో పాల్గొనడం ద్వారా జీవితంలో అనేక అంశాలపై అవగాహన పెంచుకోవచ్చని పేర్కొన్నారు. చిన్నారులకు విద్యతో పాటు ఆటపాటలు కూడా ముఖ్యమన్నారు. సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహించడానికి బాలోత్సవ్ పోటీలు దోహదపడతాయన్నారు. చిన్నారులతో వీవీఐటీ బాలోత్సవ్ ప్రాంగణం సందడిగా మారిందని సంతోషం వ్యక్తం చేశారు. నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ డాక్టర్ రావెల సాంబశివరావు మాట్లాడుతూ బాలోత్సవ్ పోటీలలో జయాపజయాలు ముఖ్యం కాదని పాల్గొనడమే ముఖ్యమన్నారు. ఏపీఎస్ఆర్టీసీ ప్రతినిధి డాక్టర్ దండు శివరామరాజు మాట్లాడుతూ సృజనాత్మకతతో దేనినైనా సాధించవచ్చన్నారు. విభిన్న ప్రాంతాలకు చెందిన పిల్లలు ఒకచోటకు చేరటం ద్వారా వారిలోని సృజనాత్మకత, నైపుణ్యాలు పెరిగి చురుకుదనంతో వ్యవహరిస్తారన్నారు. అనంతరం వేడుకలను వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, కొత్తగూడెం బాలోత్సవ్ వ్యవస్థాపకుడు వాసిరెడ్డి రమేష్, నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్టార్ డాక్టర్ రావెల సాంబశివరావు, ఏపీఎస్ఆర్టీసీ ప్రతినిధి డాక్టర్ దండు శివరామరాజు గాలిలోకి బెలూన్‌లు ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. బాలోత్సవ్ 20 అంశాలలో 61 విభాగాల్లో మూడు రోజుల పాటు 30 వేదికలపై జరుగుతుందని చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. తొలిరోజు పోటీలలో 4,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తమ ప్రదర్శనలతో ఆహూతులను ఆకట్టుకున్నారు.



పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి మూలవిరాట్



స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

సంకట 'హర'ణ నమో..

పెదకాకాని: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెదకాకాని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం హరహరమహాదేవ.. శంభోశంకర నామస్మరణతో మార్మోగింది. కార్తిక మాసం ఆఖరి సోమవారం సందర్భంగా భక్తులు ఆలయానికి పెద్దసంఖ్యలో పోటెత్తారు. వేకువనే భక్తులు ఆలయం ఎదురుగా ఉన్న యజ్ఞాల బావి వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం కార్తిక దీపాలు వెలిగించారు. ప్రభలతో తరలివచ్చిన భక్తులు పొంగలి నైవేద్యాలతో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం భక్తులు లక్ష వత్తుల దీపారాధనలు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అంతరాలయ అభిషేకాలు, దర్శనాలు, తలనీలాలు సమర్పణ, అన్నప్రాశనలు, నామకరణలు, వాహనపూజలు అధిక సంఖ్యలో జరిగాయి. క్యూలైన్లలో ఉచితంగా వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. సోమవారం ఒక్కరోజులో స్వామికి పలు సేవా కార్యక్రమాలు, అన్నదాన విరాళాలు, ప్రసాద విక్రయాల ద్వారా రూ.9,25,000 ఆదాయం సమకూరినట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాత్రి వేళ కార్తికదీప కాంతుల్లో ఆలయం తళుకులీనింది.

క్లుప్తంగా

రాష్ట్ర షూటింగ్ బాల్ పోటీల్లో బాలికల హవా



గుంటూరు వెస్ట్(క్రీడలు): అండర్-19 బాలబాలికల షూటింగ్ బాల్ పోటీల్లో బాలికల జట్టు ప్రథమ, బాలుర జట్టు ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నాయని గుంటూరు జిల్లా కార్యదర్శి ఎం.కిషోర్ బాబు సోమవారం తెలిపారు. ఈ నెల 10వ తేదీన బాపట్ల జిల్లా మార్టూరులో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపినట్లు చెప్పారు. క్రీడాకారులను అసోసియేషన్ జిల్లా చైర్మన్ రవి బాబు, కోచ్‌లు తేజ, జ్యోతి అభినందించారు.

గుంటూరు రైల్వే డివిజన్‌లో పలు రైళ్లు రద్దు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని పలు ఇంజినీరింగ్ పనుల నేపథ్యంలో పలు రైళ్ల రద్దుతో పాటు రైళ్ల దారి మళ్లించినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబర్- 12705 గుంటూరు- సికింద్రబాద్, 12706 సికింద్రబాద్- గుంటూరు, రైలు ఈనెల 10వ తేదీ నుంచి 18వ తేదీ వరకు రద్దు చేయడం జరిగిందని తెలిపారు. 17201 గుంటూరు- సికింద్రబాద్ రైలు ఈనెల 11 నుంచి 19వ తేదీ వరకు, గుంటూరు- ఖాజీపేట మీదుగా తాత్కాలికంగా రద్దు చేయడం జరిగిందని తెలిపారు. 17202 సికింద్రబాద్- గుంటూరు రైలు ఈనెల 10వ తేదీ నుంచి 18వ తేదీ వరకు ఖాజీపేట-గుంటూరు మీదుగా తాత్కాలికంగా రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

పలు రైళ్ల దారి మళ్లింపులు....

ఖాజీపేటలో రైల్వే ఇంజినీరింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో పలు రైళ్లు వయా విజయవాడ-గుంటూరు-పగడిపల్లి మీదుగా దారిమళ్లిచడం జరిగిందని చెప్పారు.

18519 విశాఖపట్నం- లోకమాన్య తిలక్ రైలు, విజయవాడ- గుంటూరు పగడిపల్లి- సికింద్రాబాద్ మీదుగా ఈనెల 9వ తేదీ నుంచి 17వ తేదీ వరకు దారిమళ్లించినట్లు చెప్పారు. 18520 లోకమాన్య తిలక్- విశాఖపట్నం రైలు ఈనెల 10వ తేదీ నుంచి 18వ తేదీ వరకు గుంటూరు డివిజన్ మీదుగా దారిమళ్లించినట్లు పేర్కొన్నారు. 11019 రైలు భువనేశ్వర్-ఛత్రపతిశివాజీ మహరాజ్ రైలు, 11020 ఛత్రపతి శివాజీమహరాజ్-భువనేశ్వర్ రైళ్లు గుంటూరు- విజయవాడ-భువనేశ్వర్‌ల మీదుగా ఈ నెల 16, 17వ తేదీలలో దారిమళ్ళించడం జరిగిందని తెలిపారు. 18045 షాలీమార్- హైదరాబాద్ రైలు ఈనెల 16,17, 18046 హైదరాబాద్-షాలీమార్ రైలు ఈనెల 17,18వ తేదీలలో సికింద్రబాద్, పగడిపల్లి, గుంటూరు, విజయవాడ మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు.

తాడేపల్లి అర్బన్ సెంటరుకు దేశవ్యాప్త గుర్తింపు

- వైద్య ప్రమాణాలు పాటించడంపై ప్రథమస్థానం
- హర్షం వ్యక్తం చేసిన జిల్లా వైద్యాధికారులు



పట్టణ ఆరోగ్య కేంద్రంలో తనిఖీలు చేస్తున్న జాతీయ స్థాయి అధికారులు (ఫైల్)

గుంటూరు మెడికల్: వైద్య ప్రమాణాలు పాటించడంలో దేశంలోనే మొట్టమొదటి స్థానంలో గుంటూరు జిల్లా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిలిచింది. జాతీయ సంస్థ నిబంధనలకనుగుణంగా అన్ని అంశాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నందుకు తాడేపల్లి డ్రైవర్స్ కాలనీలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జాతీయస్థాయిలో ప్రథమ స్థానం లభించింది. జిల్లాలోని మంగళగిరి యర్రబాలెంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి ద్వితీయ స్థానం లభించింది. ఎన్‌క్రాస్ ప్రోగ్రాంలో భాగంగా సెప్టెంబరు నెలలో గుంటూరు జిల్లాలోని తాడేపల్లి అర్బన్ పీహెచ్‌సీ, యర్రబాలెం అర్బన్ పీహెచ్‌సీలను నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఏఎస్) ప్రొగ్రాం కింద తనిఖీలు చేశారు. తనిఖీల్లో భాగంగా సంబంధిత పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ఓపీలో వైద్య సేవలు ఏవిధంగా అందిస్తున్నారు, ఓ పీలో పేషెంట్‌లకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన వైద్యం అందిస్తున్నారా లేదా, అనే అంశాల్లో పరిశీలించారు. ఓపీ వైద్య సేవలతోపాటు, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకాన్ని సైతం పరిశీలించారు. పథకంలో భాగంగా పట్టణ ఆరోగ్యకేంద్రానికి వస్తున్న రోగులకు వైద్య సేవలు ఏవిధంగా అందుతున్నాయనే విషయాలు పరిశీలించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే చిన్నారులందరికీ నూటికి నూరు శాతం టీకాలు వేయడం, సురక్షితంగా కాన్పులు చేయడం, మాతృ మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవడం, ప్రాథమిక దశలోనే క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి వైద్యం అందించడం, లెప్రసీ కేసులు గుర్తించి వైద్యం చేయడం, బీపీ, షుగర్ లాంటి దీర్ఘకాలిక రోగులను గుర్తించి ఉచితంగా వైద్యం అందించడం, హై రిస్క్ గర్భిణులను గుర్తించి సురక్షిత ప్రసవాలు చేయడం, పలు అంశాలను పరిశీలించారు. అన్ని అంశాల్లో జిల్లాలోని తాడేపల్లి అర్బన్ పీహెచ్‌సీ 97 శాతం మార్కులు సాధించి నాణ్యతా ప్రమాణాల్లో దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. యర్రబాలెం అర్బన్ పీహెచ్‌సీ 92 శాతం మార్కులతో జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. జిల్లాకు ప్రథమ, ద్వితీయ స్థానాలు జాతీయ స్థాయిలో అందడంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా కార్యక్రమాల అధికారి డాక్టర్ చుక్కా రత్న మన్మోహన్‌లు హర్షం వ్యక్తం చేశారు. ఎన్‌క్లాస్ ప్రొగ్రాంలో భాగంగా క్వాలిటీ సర్టిఫికేషన్ తమకు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జాతీయ స్థాయి ప్రమాణాలకనుగుణంగా వైద్య సేవలు అందిస్తున్న విషయాన్ని నేషనల్ మెడికల్ అధికారులు గుర్తించి జిల్లాకు ప్రథమ, ద్వితీయ స్థానాలు అందించినందుకు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజా రవాణా సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి

జిల్లా ప్రజా రవాణా అధికారి రవికాంత్



రత్తయ్యకు నియామక పత్రాన్ని అందిస్తున్న రవాణా అధికారి రవికాంత్

పాత గుంటూరు: ప్రజా రవాణా సంస్థలో పనిచేసే ఉద్యోగులు, యూనియన్ నాయకులు అందరూ ఐక్యంగా ఉండి ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా ప్రజా రవాణా అధికారి రవికాంత్ పేర్కొన్నారు. సోమవారం గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ యూనియన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సంస్థలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. యూనియన్ రాష్ట్ర ముఖ్య కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కె.రత్తయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ప్రజా రవాణా అధికారి రవికాంత్‌ను కలిసి ఉద్యోగుల సమస్యలను ఆయనకు తెలియజేశారు. వెంటనే ఆయన స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి పలు సమస్యలకు పరిష్కారం చూపారు. నూతనంగా ఎన్నికైన రత్తయ్యకు ప్రజా రవాణా అధికారి రవికాంత్ నియామక పత్రాన్ని అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి. రవి, ప్రధాన కార్యదర్శి కె. ఇజ్రా శాస్త్రి, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, రీజనల్ నాయకులు జయరావు, ఇమ్మానియేల్, శేఖర్, బీఎస్పీ నాయకులు పి.సాయి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు పురుగు మందుల వినియోగంపై అవగాహన సదస్సు

గుంటూరు మెడికల్: భారత రసాయనాలు, పెట్రో రసాయనాల విభాగం ఆధ్వర్యంలో గుంటూరు ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయంలో మంగళవారం స్థిరమైన వ్యవసాయ అభివృద్ధికి వినియోగదారు, పర్యావరణ అనుకూల పురుగు మందుల సూత్రీకరణ పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ టి.దామోదర్ నాయుడు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుందన్నారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం

అద్దంకి రూరల్: పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల సమీపంలో గుర్తు తెలియని ఓ వృద్ధురాలి మృతదేహం సోమవారం లభ్యమైంది. ఈ వృద్ధురాలు ఎక్కడి నుంచో వచ్చి అక్కడ పడి ఉండటంతో స్థానికుల పోలీసులకు సమాచారం అందించారు. ఈమేరకు ఎస్ఐ ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి వివరాలు సేకరించనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శివనామస్మరణతో మార్మోగిన అమరారామం



విశేషాలంకారంలో అమరేశ్వరుడు

అమరావతి: ప్రసిద్ధ పంచారామ క్షేత్రాలలో ప్రథమారామ క్షేత్రమైన అమరావతి శ్రీబాల చాముండికా సమేత అమరేశ్వరాలయం కార్తిక సోమవారం పర్వదినాన భక్తులచే శివపంచాక్షరి నామస్మరణతో మార్మోగింది. సోమవారం వేకువ జామున పంచారామక్షేత్రం సందర్శకులతో కిటకిటలాడింది. భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్య స్నానాలు చేసి ఆలయంలోని ఉసిరి చెట్టు వద్ద దీపారాధనలు చేశారు. ఉదయాన్నే భక్తుల పరోక్షంలో కార్తికమాస అభిషేక పథకం ద్వారా నిర్వహించే అభిషేకాలను అర్చకస్వాములు నిర్వహించారు. అలాగే భక్తులు స్వామివారికి ఎనిమిదివందలకుపైగా అభిషేకాలతో పాటు అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. వేకువజామునే పంచారామ క్షేత్రాలను సందర్శించి సుమారు వందకు పైగా బస్సులలో వచ్చిన భక్తులతో దేవాలయంలో సందడి ఏర్పడింది. మధ్యాహ్నం నుంచి జిల్లావ్యాప్తంగా రావాల్సిన భక్తుల సందర్శన క్రమేపి పెరిగింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా వేమూరి గోపీనాథశర్మ నిరంతరం పర్యవేక్షించారు. అలాగే ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా దేవాలయ పరిసర ప్రాంతాలలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

నగర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- నాలుగున్నరేళ్లలో రూ.500 కోట్ల అభివృద్ధి పనులు
- కాంట్రాక్టర్లతో ప్రత్యేకంగా సమావేశమై పనుల వేగవంతం
- మేయర్ కావటి మనోహర్‌నాయుడు వెల్లడి
- సభ్యుల ప్రశ్నలు, ప్రతిపాదనల పరంపర
- ఉదయం నుంచి రాత్రి వరకు నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం



సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగర సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో ఏ కార్పొరేషన్‌లో జరగనంతగా సుమారు రూ.500 కోట్ల పనులు గుంటూరు కార్పొరేషన్‌లో జరిగాయని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు పేర్కొన్నారు. సోమవారం నగర మేయర్ అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో జరిగింది. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన సమావేశం సభ్యుల 61 ప్రశ్నలు, 102 ప్రతిపాదనలతో, నగరపాలక సంస్థకు సంబంధించి 3 ప్రియాంబుల్స్‌తో రాత్రి వరకు సుదీర్ఘంగా సాగింది.

అధికారుల తీరుపై కార్పొరేటర్ల ఆగ్రహం

సమావేశం ప్రారంభం కాగానే గత సమావేశాల్లో అడిగిన ప్రశ్నలకు ఇంత వరకు సరైన సమాధానాలు(యాక్షన్ టేకెన్ రిపోర్ట్) అధికారులు ఇవ్వడం లేదంటూ కార్పొరేటర్లు షేక్ రోషన్, అచ్చాల వెంకటరెడ్డి, ఈచంపాటి వెంకటకృష్ణ(ఆచారి) మండిపడ్డారు. దీనికి మేయర్ కలగజేసుకుని కౌన్సిల్ సమావేశం జరిగిన రెండు వారాల్లో యాక్షన్ టేకెన్ రిపోర్టు కౌన్సిల్ సభ్యులకు అందజేయాలని ఆదేశించారు.

వంతెనల నిర్మాణం చేపట్టాలి

రైల్వే క్రాసింగ్‌ల వద్ద ఆర్‌యూబీ, ఆర్వోబీ నిర్మాణాలు చేపట్టాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కోరారు. ముఖ్యంగా శ్యామలానగర్ రైల్వే గేటు వద్ద గేటు పడితే చాలా ఇబ్బందులు తలెత్తున్నాయని కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. వంతెనల నిర్మాణం చేపట్టాలని కోరారు. కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ రైల్వే క్రాసింగ్‌ల వద్ద



ప్రసంగిస్తున్న మేయర్ మనోహర్ నాయుడు, పక్కన కమిషనర్ కీర్తి చేకూరి, ఇతర అధికారులు

బ్రిడ్జిల నిర్మాణానికి ఈనెల 5, 7వ తేదీల్లో రైల్వే అధికారులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు. ఆర్‌యూబీ(రోడ్డు అండర్ బ్రిడ్జి)ల్లో వర్షం పడితే నీరు నిలిచిపోవడం, ప్రమాదాలు జరుగుతున్నందున వాటి నిర్మాణానికి రైల్వే శాఖ సుముఖంగా లేదని స్పష్టం చేశారు. ఆర్వోబీ నిర్మాణాలకు మాత్రమే ఆ శాఖ ముందుకు వస్తోందని పేర్కొన్నారు. దీంతో ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఆర్వోబీ నిర్మాణం చేపడితే దాదాపు 500 ఇళ్లు నష్టపోయే పరిస్థితి ఉందని, ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి సహకారంతో రైల్వే అధికారులతో మాట్లాడాలని సూచించారు.

ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోండి

గుంటూరు నగరపాలక సంస్థ ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయని, లీజులు తీసుకుని గడువు ముగియగానే అక్రమార్కులు కోర్టుకు వెళ్లి స్టేలు తెచ్చుకోవడం పరిపాటిగా మారిందని, పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులను పరిష్కరించి ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ కోర్టు కేసుల పరిష్కారానికి ప్రత్యేకంగా అడ్వకేట్లను నియమించాలని కోరారు.

ఆధారాలు ఉంటే అధికారులపై చర్యలు

నగరంలో అభివృద్ధి పనులకు బిల్లుల చెల్లింపులో కొంత జాప్యం జరుగుతుందని పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ ప్రస్తావించారు. దీనికి మేయర్ కావటి కూడా మద్దతు పలికారు. దీంతో కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు సీఎఫ్ఎంఎస్ ద్వారానే జరుగుతున్నాయని, అత్యవసరమైతే చెక్కులు అందజేస్తున్నామని పేర్కొన్నారు. బిల్లుల చెల్లింపుపై కౌన్సిల్ తీర్మానం చేస్తే ఆ విధంగా చేస్తామన్నారు. అకౌంట్స్ సెక్షన్‌లో కొందరు అధికారులను ప్రసన్నం చేసుకుని తమకు నచ్చిన వారికి బిల్లులు చేస్తున్నారనే ఆరోపణలపై ఆధారాలు ఉంటే చర్యలకు వెనుకాడబోమని స్పష్టం చేశారు.

ఎస్పీ గారూ.. న్యాయం చేయండి..

- ఆరీఫ్ హఫీజ్‌కు ఫిర్యాదుల వెల్లువ
- ఎక్కువగా కలహాలు, లావాదేవీలు, వివాదాలకు సంబంధించినవే!
- పరిష్కరించాలంటూ సంబంధిత అధికారులకు ఆదేశాలు



ఫిర్యాదిదారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఆరీఫ్ హఫీజ్

గుంటూరు ఈస్ట్: జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలోని జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం సోమవారం నిర్వహించారు. బాధితుల నుంచి ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదిదారుల సమస్యలు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులను సమస్యలు సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఎక్కువగా కుటుంబ కలహాలు, ఆర్థిక లావాదేవీల వివాదాలే ఫిర్యాదులు అందాయి. అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, డీసీఆర్బీ డీఎస్పీ శ్రీనివాసరావులు ఉన్నారు. పలువురి సమస్యలు వారి మాటల్లో...

నిందితులపై చర్యలు తీసుకోవాలి

నాకుమార్తె అక్షయ (14) ఈనెల 3వ తేదీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేలాడుతూ కనిపించి మృతిచెందింది. ఇద్దరు యువకులు నా కుమార్తెను ప్రేమించమంటూ వెంటపడి వేధించారని నా కుమార్తె స్నేహితుల ద్వారా తెలిసింది. నిందితులపై కఠిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలి.

-మల్లెల శ్రీదేవి, దాసరిపాలెం, గుంటూరు రూరల్ మండలం

నకిలీ బంగారం ఇచ్చి మోసం చేశారు

గుర్తు తెలియని ఇరువురు వ్యక్తులు నావద్దకు వచ్చి తక్కువ రేటుకు బంగారం ఇస్తామని నమ్మించారు. మొదట ఒక గ్రాము బంగారం తీసుకుని పరీక్షించగా, ఒరిజినల్ అని తేలింది. దీంతో రూ. 25 లక్షలు చెల్లించి అంతమొత్తం బంగారం తీసుకున్నా. ఇటీవల బంగారం మొత్తం పరీక్ష చేయించగా, నకిలీదని తేలింది. మోసపోయా.. న్యాయం చేయండి.

- తిరుపతిరెడ్డి, గుంటూరు

ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

ఓ కన్సల్టెన్సీ నిర్వాహకుడు మా ఇద్దరు పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. విడతల వారీగా రూ. 15 లక్షలు చెల్లించా. ఉద్యోగం ఇప్పించలేదు. న్యాయం చేయాలి.

- జెట్టి విల్సన్‌బాబు, పెదకాకాని,

రైల్వే ట్రాక్‌పై పడిపోయిన మహిళ

- ప్రాణాలు కాపాడిన స్థానికులు
- రూ.80 వేలు ట్రైన్‌తో పాటు గాలిలోకి..!



తాడేపల్లిరూరల్: మంగళగిరి- తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని డ్వాక్రా లీడర్ సమయానికి బ్యాంకుకు వెళ్లాలని రైల్వే ట్రాక్ దాటుతుండగా కంగారులో కిందపడి గాయాలపాలైన ఘటన సోమవారం తాడేపల్లి కృష్ణా కెనాల్ జంక్షన్ పరిధిలోని వైఎస్సార్ సెంటర్ వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడులో నివాసముండే డ్వాక్రా లీడర్ లక్ష్మి, ఎల్లమ్మ డ్వాక్రా గ్రూప్‌కు లీడర్‌గా పనిచేస్తోంది. గ్రూపు సభ్యులందరూ కలసి సాయంత్రం 3 గంటల సమయంలో 84 వేల రూపాయలు ఇవ్వడంతో బ్యాంకులో జమ చేసేందుకు 4 గంటల 10 నిమిషాలకు వైఎస్సార్ సెంటర్‌లోని రైల్వేగేటు వద్దకు ఆటోలో వచ్చింది. గేటు మూసి ఉండడంతో బ్యాంక్ సమయం అయిపోతుందని నగదు కలిగి ఉన్న బ్యాగ్‌ను తీసుకుని రైలు పట్టాలు దాటుతుండగా కింద పడిపోయింది. అదే సమయంలో అతివేగంగా ట్రైన్ వస్తుండడాన్ని స్థానికులు గమనించి ఆమెను పట్టాల మీద నుంచి పక్కకు లాగి రక్షించారు. ఆమె చేతికి ఉన్న బ్యాగ్ ట్రైన్‌కు తగిలి బ్యాగ్‌లో ఉన్న రూ.84 వేలు బ్యాగ్‌లో నుంచి బయటకు వచ్చి ట్రైన్ వేగానికి వచ్చిన గాల్లో ఎగిరిపోయాయి. అది గమనించిన స్థానికంగా ఉన్న యువకులు ఆ డబ్బులు సేకరించి ఆ మహిళకు ఇవ్వగా ఇంకా రూ.24 వేలు కనిపించడం లేదంటూ ఆ మహిళ తెలిపింది. ఈ ప్రమాదంలో మహిళ బొటన వేలికి తీవ్ర గాయమైంది. బ్యాంకుకు సమయం అయిపోతోందని తొందరలో రైల్వే ట్రాక్ దాటి వెళుతున్నానని, ఆ సమయంలో కింద పడ్డానని అంతవరకు నాకు గుర్తుందని ఆమె పేర్కొంది. గాయపడిన ఆ మహిళను స్థానికంగా ఉన్న ఆస్పత్రిలో చికిత్స చేయించి, ఆటోలో ఇంటికి పంపించారు.

రూ. 12.21 లక్షల విలువైన ఎరువులు సీజ్

ప్రత్తిపాడు దుకాణాల్లో వ్యవసాయశాఖ విస్తృత తనిఖీ



ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ అరుణకుమారి

ప్రత్తిపాడు: 'సాక్షి' కథనంపై అధికారులు స్పందించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని ఎరువుల దుకాణాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఎరువులను సీజ్ చేశారు. ప్రత్తిపాడులోని ఎరువుల దుకాణాల్లో కృత్రిమ కొరత సృష్టించి ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తూ రైతుల జేబుకు కన్నం పెడుతున్నారంటూ ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన 'ఆపదలో అన్నదాత జేబుకు కన్నం' కథనంపై వ్యవసాయశాఖ అధికారులు స్పందించారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు పలు ఎరువుల దుకాణాలు, గోడౌన్లలో గుంటూరు సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు టి.శ్రీనివాసరావు, ఏఓ అరుణ కుమారి తనిఖీలు నిర్వహించారు. తొలుత మోహన్ ట్రేడర్స్‌లో రికార్డులు, అనుమతులను పరిశీలించారు. అనంతరం గోడౌన్లో స్టాక్ పరిశీలించారు. రిజిస్టర్‌లలో ఉన్న స్టాక్‌కు, గోడౌన్‌లో ఉన్న స్టాక్‌కు మధ్య భారీ వ్యత్యాసం ఉండటంతో 1,875 మెట్రిక్ టన్నుల 14-35-14 ఎరువులను, 23.5 మెట్రిక్ టన్నుల డీఏపీని సీజ్ చేశారు. వీటి విలువ రూ.12,21,000 ఉంటుందని, ఈసీ 1955 యాక్ట్ ప్రకారం 6ఏ కేసు నమోదు చేశామని ఏడీఏ తెలిపారు. అదేవిధంగా ఫామ్-ఓను లైసెన్స్‌లో పొందుపరచకపోవడం వలన ఎస్ఆర్ ట్రేడర్స్‌లో రూ. 3.14,350 విలువ చేసే 11 మెట్రిక్ టన్నుల ఎరువులు, పయనీర్ ఆగ్రోస్‌లో రూ. 5,77,007 విలువ చేసే ఎరువుల అమ్మకాలను నిలిపివేశామన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏఓ అరుణకుమారి తెలిపారు. మండలంలోని ఆర్‌బికేల్లో 36 మెట్రిక్ టన్నుల యూరియా, 18.35 మెట్రిక్ టన్నుల డీఏపీ, 23.65 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు ఆర్‌బీకేల ద్వారా పొందాలని రైతులకు సూచించారు.

రమాదేవికి సాహితీరత్న జాతీయ పురస్కారం ప్రదానం



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన రిటైర్డ్ టీచర్, రచయిత డాక్టర్ సరికొండ రమాదేవికి తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సాహితీ రత్న జాతీయ పురస్కార ప్రదానం చేశారు. ఈ నెల 10న విజయవాడలోని రాఘవయ్య పార్క్ వద్ద గల బాలోత్సవ భవనంలో తెలుగు వెలుగు సాహితీ వేదిక గ్రేటర్ వరంగల్ వారిచే ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ ఐదు రాష్ట్రాల స్థాయిలో వివిధ రంగాలలో ప్రావీణ్యం పొందిన దాదాపు 200 మందికి కళలు, సాంఘిక సేవా, విద్య, వైద్య, అర్చక, భరత నాట్యం రంగాలలో పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ క్రమంలో తెలుగు వెలుగు సాహితీ వేదిక గౌరవ అధ్యక్షుడు బ్రహ్మశ్రీ వంగల శాంతి కృష్ణ ఆచార్య, చందు సాంబశివరావు, రాజకుమార్ చేతుల మీదుగా రచయిత రమాదేవికి సాహితీరత్న జాతీయ పురస్కార ప్రదానం చేశారు.